# పెళ్ళి చేసుకో

వసుంధర




కొంగుముడి వేసుకున్న కొత్త దంపతులు అగ్ని హోత్రానికి ప్రదక్షిణం చేస్తున్నారు. అంటే అగ్నిసాక్షిగా వివాహం జరిగిపోతుందన్నమాట!

ఆ దృశ్యం చూస్తుంటే రాజారావు మనస్సు గతాన్ని తవ్వసాగింది. ఏవేవో మధురభావనలు అతన్ని ఉరుకలెత్తించాయి. అక్కణ్ణుంచి అతను తక్షణం లేచి వెళ్ళిపోయాడు.

పెళ్ళివేడుకలను పారవశ్యంతో చూస్తూ, మధ్య మధ్య తనూ రెండు ఛలోక్తులు విసురుతూన్న వసుంధరకు ఉన్నట్టుండి భర్త గుర్తుకువచ్చాడు. ఆమె అటూ ఇటూ చూసింది. రాజారా వెక్కడా కనిపించలేదు. 'ఏమైపోయారు చెప్మా!' అనుకుంటూ అక్కణ్ణుంచి లేచి విడిదిగృహానికి వెళ్ళింది ఆమె.

జనమంతా పెళ్ళి చూడ్డానికి వెళ్ళిపోయినమూలాన విడిదిగృహం వెలవెలగా ఉంది. రాజారావుమాత్రం వీధి అరుగుమీద కూర్చుని కాగితాలమీద ఏవేవో చకచక రాసేస్తున్నాడు.

వసుంధర భర్త ముఖాన్ని చూసి నవ్వుకుంది. ఏకాగ్రతలో ఉన్నప్పు డాయనకు ఎదట ఎవరున్నది తెలియదు! పరిసరాలతో సంబంధం లేదు. అలా రాసుకుపోతూంటారు. ఆ సమయంలో అతని ముఖం చూడడానికి ఆమె కెంతో ముచ్చటగా ఉంది.

రాజారావు తలెత్తి చూసేసరికి ఏకాగ్రతతో తన వంకే చూస్తూన్న వసుంధర కనిపించింది. "అరే, నీ వెప్పుడు వచ్చావు, వసూ?" అన్నాడు.

"వచ్చి గంటేనా అయిఉంటుంది. కానీ ఏమండీ, ఏమిటండీ మీరు రాస్తున్నది?"

"ఇదా? ఇది యువకులందరినీ పెళ్ళి చేసుకోమని ప్రబోధించే కథ. పెళ్ళిఅంటే ఏదో గుదిబండ తగిలించు కోవడమనే అభిప్రాయంతో ఉండే వాళ్ళ దురభి ప్రాయాల్ని తొలగించి, పెళ్ళిలో జరిగే మధుర సన్నివేశాలను వాళ్ళకి తెలియపరిచి ఆవేశాన్ని కలిగించా లని వ్రాస్తూన్న కథ, వసూ!"

"అలాంటి కథ రాయాలని మీకెందు కనిపించిందండీ అసలు?"

"మన పెళ్ళి అయినప్పటినించి రాయాలని ఉంది, వసూ. కానీ ఈ రోజు ఈ పెళ్ళి చూస్తూంటే నాకు పరిఅయిన ఆవేశం కలిగింది. చాలా భాగం రాసేశాను."

"ఏదీ, నన్ను చూడనీండి" అంటూ వసుంధర అతని దగ్గిరనించి పుస్తకం తీసుకుంది.

"ఇదంతా మన పెళ్ళివేడుకే. ఉత్సాహభరితమైనవీ, విచిత్రంగా ఉండేవీ కొన్ని సన్నివేశాలుమాత్రమే తీసుకు రాశాను. నువ్వు చదువుతూంటే వినాలని కోరికగా ఉంది. చదువుతావా?"

ఆమె సిగ్గుపడింది.

"అలా వీల్లేదు. చదవాలి, వసూ. నెమ్మదిగా చదువు. నువ్వు చదువుతూంటే ఎంత మధురంగా ఉంటుందో తెలుసా?"

వసుంధర ఎక్కువగా బతిమాలించుకోకుండానే అతని పక్కనే కూర్చుని నెమ్మదిగా చదవడం మొదలు పెట్టింది. అతను కుర్చీలో వెనక్కి చేరగిలబడి అర మోడ్పుకన్నులతో వినసాగాడు.

• • •

"అన్నయ్య వచ్చేశాడేవ్, అమ్మా!" అంటూ శంకరం చిన్నతమ్ముడు గోపీ లోపలికి పరిగెత్తాడు. రామలక్ష్మి అన్నయ్యవంక అదోలా చూసి నవ్వింది. శంకరం కొంటెగా నవ్వాడు చెల్లెల్ని చూసి.

"అమ్మాయ్, అన్నం వార్పుకి వచ్చింది. కొంచెం చూస్తూండమ్మా" అంటూ పార్వతమ్మ మండువా లోకి పరిగెత్తుకువచ్చింది. కోడలు సుందరి అత్తగారి ఆజ్ఞల నెన్నడు అతిక్రమించి ఎరగదు. వార్పుకి వచ్చిన అన్నాన్ని అలా చూస్తూ ఉండిపోయి, నయనం మినహాగా సర్వేంద్రియాలనూ మండువానైపు

నెమ్మదిగా గిల్లినా ఆమె ఉంగరాన్ని వదల్లేదు. గట్టిగా గిల్లడానికి మనసొప్పక పోనీలే అని వదిలేశా డతను, ఎలాగైనా బంగారం విషయంలో ఆడవాళ్ళు గట్టివాళ్ళే అనుకుంటూ.

తరవాత ఒక హోమంలో రామలక్ష్మిచేత చిన్న గిన్నెలో అన్నం వండించారు హోమంలో వెయ్యడానికి. ఆమె పోసిన నీళ్ళు, ఆ కొద్ది బియ్యానికీ సరిపోకపోవడంతో, ఆమెకు బహుశా వంట రాదని అనుకున్నా డతను.

తరవాత అలకపాన్పు! ఇది మరీ తమాషాగా ఉంది. ఇద్దర్నీ ఒక మంచంమీద ఎదురెదురుగా కూర్చోపెట్టి, వసంతం చల్లుకోమనీ, బుక్కా చల్లుకోమనీ, గంధం ఒకళ్ళ కొకళ్ళు రాసుకోమనీ చెప్పి, అమ్మాయి కొరికిన కిళ్ళీ అబ్బాయికీ, అబ్బాయి కొరికిన కిళ్ళీ అమ్మాయికీ ఇచ్చి తినిపించారు. అప్పటికి బాగా రాత్రి అయిపోవడం మూలాన పెళ్ళికొడుక్కీ, పెళ్ళికూతురికీకూడా నిద్రవచ్చే సూచనలు కనిపించాయి. ఆ నిద్రబాధలో అతనికి అలకపాన్పు గదా, అలగాలి అనే ధ్యాస లేదు. ఆ పట్టింపుకూడా ఎవరికీ ఉన్నట్లు లేదు.

ఇంతలో పురోహితుడు మంచం పక్కనే వేలాడ గట్టిన ఉయ్యాలలోనించి ఓ గంధపుచెక్క తీసి రామలక్ష్మి చేతికి ఇచ్చాడు. "నేను వంట చేసుకోవాలి, పిల్లాడేడుస్తున్నాడు! కాస్సేపు ఎత్తుకోండి!" అనమ్మా అన్నాడు.

రాజగోపాలరావు కుతూహలంగా ఆమెవంక చూశాడు ఏమంటుందోనని.

పాపం, ఆమె చాలా సిగ్గుపడిపోయింది. ఇలాంటి మాటలు బొమ్మలపెళ్ళిళ్ళలో చాలాసార్లు అనకపోలేదు గానీ, ఇది బొమ్మలపెళ్ళి కాదు గదా! వంచిన తలకూడా పైకెత్తకుండా ఉండిపోయింది!

"తొందరగా అనేయమ్మా" అన్నాడు పురోహితుడు. అనలేనన్నట్లుగా తల అడ్డంగా తిప్పింది ఆమె!

"అలా అంటే కుదరదు. అనాలి!" ఓ ముత్తైదువ హెచ్చరించింది. రామలక్ష్మి ఈడుగల పెళ్ళికాని ఆడపిల్లలు కొంతమంది ఆమెవంక కుతూహలంగా చూస్తున్నారు ఏమంటుందోనని.

"పోనీ, ముందు నువ్వే అనవోయ్" అన్నాడు పురోహితుడు. "నేను యూనివర్సిటీకి పోవాలి. పిల్లాడిని ఎత్తుకోడానికి తీరుబడి లేదు. నువ్వే ఎత్తుకో!" అన్నాడు రాజగోపాలరావు. కూర్చున్నవాళ్ళంతా ముసిముసినవ్వులు నవ్వుకున్నారు.

అఖరికి రామలక్ష్మికూడా తన మాటలు ఎవరికీ వినిపించనంత నెమ్మదిగా అంది. ఎంతో ఆసక్తిగా వింటున్న రాజగోపాలరావు ఒక్కడికే ఆ మాటలు వినిపించాయి. గట్టిగా అనాలని కొంతమంది ఆమెను బలవంతపెట్టారుగాని, తనకు వినిపించిందని రాజగోపాలరావు చెప్పడంతో ఊరుకున్నారు.

అప్పుడు నిద్రలోఉన్న రాజగోపాలరావు చెల్లెలిని లేపి తీసుకువచ్చి, "పిల్లాడిని నే నెత్తుకుంటాగానీ, అల్లుడి నిస్తావా? మాడ నిస్తావా?" అనిపించారు. నిద్రమత్తులో ఆమె ఏదో అంది. రామలక్ష్మిచేత ఈసారి జవాబు చెప్పించడం సులభమే అయింది.

అప్పు డిద్దర్నీ భోజనం చెయ్యమన్నారు. తెల్లవారు ఝామున మూడుగంటలకు భోజనం చెయ్యడం చాలా కష్టం కాబట్టి, ఇద్దరూ కూడా శాస్త్రానికి ఎంగిలిపడి మళ్ళీ ఊరేగింపుతో విడిదిగృహానికి బయలుదేరారు. రామలక్ష్మి కేదో పెద్ద మూట కట్టి భుజాన వేశారు.

విడిది ఇంట్లో ప్రవేశించేముందు ఇద్దర్నీ పేర్లు చెప్పమన్నారు. రామలక్ష్మి చెప్పడం మానేసి ఊరికే సిగ్గుపడిపోసాగింది. అప్పటికీ ముందు రాజగోపాలరావే చెప్పాడు — "రామలక్ష్మీ, నేనూ వచ్చాం. తలుపు తీయం"డని!

ఆమె సిగ్గుతో పదిహేను నిమిషాల కాలాన్ని మింగేసింది. నేను చెప్పనని సిగ్గుతో ఆమె ముఖాన్ని అడ్డంగా తిప్పుతూంటే, చాలా ఆసక్తిగా చూశా డతను ముచ్చటైన ఆమె ముఖంవంక, నిద్రసుకూడా మరిచిపోయి.

చివరికి ఆమె అతని పేరు చెప్పింది. "రాజగోపాల రావు బావగారూ, నేనూ వచ్చాము" అంది.

ఆమె నోటితో ఉచ్చరించడంద్వారా తన పేరుకూ, తనకూ ఏదో సార్థకత లభించినట్లనిపించిం దతనికి. తన పేరు అంత బాగుంటుందని అతనెప్పుడూ అనుకోలేదు.

తరవాత విఘ్నేశ్వరపూజ చేసుకున్నాక ఇద్దరూ విడిపోయారు. అలిసిపోయిన వధూవరు లిద్దరూ తమ స్థానాల్లో గాఢంగా నిద్రపోయారు, మధుర స్వప్నాల్లో తేలిపోతూ.

ఇక తరవాత చెప్పుకోదగ్గ విశేషాలేమీ లేవు. మరునా డుదయం ఇద్దరూ కలిసి ఒకే కంచంలో భోజనం చేశారు. అన్నం అమృతంలా ఉంటుందని రాజగోపాలరావుకి ఆ అనుభవం తెలిపింది.

ఆ రాత్రి . . .

ప్రతి యువకుడూ, యువతీ ఎదురుచూసే తొలిరేయి. . .

* * *

"ఛీ, ఇదికూడా రాశారా?"

"అంత మధురమైన అనుభవాలను చెప్పకుండా, పెళ్ళిచేసుకోమంటేమాత్రం ఎవడు చేసుకుంటాడు, వసూ! ఊఁ చదువు! నువ్వు చదువుతూంటే ఈ కథ ఎంత బాగుందని!"

వసుంధర సిగ్గుతో తల వంచుకుంది. "నేను చదవలే నండీ, సిగ్గేస్తూంది!" ఆమె కంఠస్వరంలో కొంటె తనం లేకపోలేదు.

"అలా అంటే కుదరదు! చదివితీరవలిసిందే!"

"చదువుతానుగానీ, ఇంతకీ ఈ రామలక్ష్మీ, రాజగోపాలరావూ ఎక్కడ దొరికారు మీకు?"

"ఎక్కడో ఏమిటి? రామలక్ష్మి నా ఎదురుగానే ఉంది. ఇక నేనే రాజగోపాలరావుని. మరి చదువు!"

వసుంధర సిగ్గుతో అలాగే ఉండిపోయింది. రాజారావు ఆమెవంక చూసి, "అసలు ఇంతవరకూ చదివాక ఏమని నీ కనిపిస్తూంది, వసూ?" అని అడిగాడు.

"మీరేమీ అనుకోనంటే చెబుతాను" అంది వసుంధర.

"అనుకోను, చెప్పు!"

"అయితే ఇక్కడ కాదు, ఆ గదిలో చెబుతాను! రండి" అంటూ తమకోసం ప్రత్యేకించబడిన ఆ గదిలోకి దారితీసింది వసుంధర.

"మరి, చెప్పుదూ."

"నాకు మళ్ళీ పెళ్ళి చేసుకోవాలనిపిస్తూంది!"

రాజారావు ఉలిక్కిపడ్డాడు. "ఎవరిని?"

"ఇంకెవరిని, మిమ్మల్నే!"

"అబ్బ, నన్నెమ్మతో చంపావు!" తేలికగా నిట్టూర్చి రాజారావు అన్నాడు: "మరి చదవ్వూ?"

వసుంధర అతనివంక గోముగా చూసి, "మీరింకా పూర్తిగా రాయలేదు గదా అని చదవడంలేదు. పూర్తి చేయండి" అంటూ పుస్తకాన్ని అందించింది. పుస్తకంతోపాటు ఆమె చేతినికూడా పట్టుకున్నాడు రాజారావు.

"మరి కథ పూర్తిచేయరూ? ఆ రోజు రాత్రి..." కొంటెగా నవ్వింది వసుంధర.

"ఆ రోజు రాత్రికోసం ఈ రోజు వదులుకోలేను. అదెప్పుడైనా రాస్తానులే!" అన్నాడు రాజారావు.

వసుంధర నవ్వుతూ ఏదో అనబోయిందికానీ, అతను ఆమె నోటిని మూశాడు మాట్లాడకుండా— చేత్తోమాత్రం కాదు ... తరవాత తెలుసుకోవాలంటే పెళ్ళిచేసుకోవలిసిందే! ★




## పుష్పము మీ అదృష్టం చెప్పగలదు

మీ భవిష్యత్తులో ఏమీ జరుగబోవునదిన్నీ, మీ సరియైన చర్యను గురించిన్నీ మీరు తెలుసుకొనగోరినట్లయితే ఒక పోస్టు కార్డుపైన మీకు ఇష్టమగు ఒక పుష్పము పేరున్నూ, మీరు వ్రాయుతేదీ, వేళ వివరములున్నూ, మీ సరియైన పిరునామానూ, వెంటనే వ్రాసి పంపండి. జ్యోతిష శాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి, మీరు కార్డు వ్రాసిన తేదీ లగాయతు 12 మాసములలోనూ మీయొక్క అదృష్టము, లాభనష్టములు, జీవిత మార్గము ఏ వ్యవహారములో మీకు జయము కలుగునో ఉద్యోగం విషయంలో మంచి చెడ్డలు, మార్పులు, ఆరోగ్య విషయము, పరదేశ గమనము, తీర్థయాత్రలు, వివాహము, స్త్రీ సుఖము, సంతానము, నిధినిక్షేపములు, లాటరీ, అకస్మాద్ద్రవ్యలాభము మొదలగు వానిని గురించి స్పష్టముగా మాసవారీగా వ్రాసి రు. 1—25 పైకముమాత్రము వి. పి. గా పంపగలము. (వి. పి. చార్జీలు ప్రత్యేకం) దుష్టగ్రహము లేవైనా ఉన్నయెడల శాంతిచేయు విధానము కూడా తెలుపగలము. వివరములు మా పూచీపైన పంప బడును. మేము పంపిన భోగట్టా మీకు తృప్తిగా లేనిఎడల పైకము వాపసు చేయబడును. ఒకసారి పరీక్షించండి. అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి.

**PT. DEV DUTT SHASTRI, RAJ JYOTSHI (A.P.W.)**
**POST BOX NO. 86, JULLUNDUR CITY.**